

'యోగా'కు ప్రత్యేక కార్యాచరణ: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు యోగాపై అవగాహన పెంచేందుకు ప్రతీ మండలానికి ఒక మాస్టర్ ట్రైనర్‌ను నియమించాలి. శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలి. మండలస్థాయిలో నోడల్ అధికారులను నియమించి, పర్యవేక్షణ బాధ్యతను అప్పగించాలి. జిల్లావ్యాప్తంగా రోజువారీ యోగా కార్యక్రమాలు నిర్వహించాల'ని అధికారులను ఆదేశించారు.



హనుమాన్‌కు వెండి మబ్బుల నీరాజనం

వంశధార నదీ తీరాన నరసన్నపేట మండలం మడపాంలో భారీ హనుమాన్ విగ్రహంపై గురువారం వెండి మబ్బుల రూపంలో మేఘాలు కమ్ముకున్నాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని.. అంజనీపుత్రుడికి నీరాజనం పలికేలా మేఘాలు కనువిందు చేశాయి. అలాగే జిల్లావ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు

- నరసన్నపేట, మే 22(ఆంధ్రజ్యోతి)



శ్రీకాకుళం పుణ్యపువీధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

సిక్కోలు మేజర్‌కు అపూర్వ గౌరవం



మేజర్ రామ్‌గోపాల నాయుడు

- కీర్తిచక్ర అవార్డుకు రామ్‌గోపాలనాయుడు ఎంపిక
- రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

సంతబొమ్మాళి, మే 22(ఆంధ్రజ్యోతి): సిక్కోలు మేజర్‌కు అపూర్వ గౌర వం దక్కింది. సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన ఆర్మీ మేజర్ మళ్ల రామ్‌గోపాలనాయుడుకు.. దేశ రక్షణ చరిత్రలోనే రెండో అత్యుత్తమ పురస్కారమైన 'కీర్తి చక్ర అవార్డు' లభించింది. గురు వారం రాష్ట్రపతి భవనంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డును ప్రదానం చేశారు. 2023లో ఉగ్రవాదులతో వీరోచితంగా చేసిన పోరాటాన్ని గుర్తిస్తూ.. ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రీయ రైఫిల్స్ బెటాలియన్‌లో పనిచేస్తున్న రామ్‌గోపాలనాయుడు కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ వద్ద మోహరించిన పెట్రోలింగ్ బృందానికి లీడర్‌గా వ్యవహరించారు. 2023 అక్టోబర్ 26న ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడ్డారని సమాచారం అందగా ఆయన రంగంలోకి దిగారు. జవాన్‌లకు మార్గనిర్దేశం చేస్తూ.. ఉగ్రవాదులను పట్టుకునే ప్రయత్నం చేశారు. ఉగ్రవాదులు ఎదురుకాల్పులు చేయడంతో తన దళాలకు పొంచి ఉన్న ప్రమాదాన్ని గ్రహించి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో ఒక ఉగ్రవాదిని హత మర్చారు. దాడిని ధైర్యంగా ఎదుర్కొని తన సైనికులను కాపాడు కుంటూ.. ఉగ్రవాదుల ను మట్టుబెట్టడంలో కీలకపాత్ర పోషించారు. ఆయన ధైర్యసాహసాలను మెచ్చి.. కీర్తి చక్ర పురస్కారానికి ఎంపిక చేశారు.

- రాష్ట్రపతి చేతుల మీదుగా తన కుమారుడు కీర్తిచక్ర అవార్డు అందుకోవడం ఎంతో గర్వంగా ఉందని రామ్‌గోపాలనాయుడు తండ్రి అప్పలనాయుడు తెలిపారు.

రైతు కుటుంబంలో పుట్టి.. దేశ సేవలో తరించి..

నగిరిపెంటకు చెందిన సన్నకారు రైతు మళ్ళ అప్పలనాయుడు, హేమమాలిని దంపతులకు 1995 జూన్16న రామ్‌గోపాలనాయుడు జన్మించారు. రామ్ గోపాలనాయుడుకు ఇద్దరు తమ్ముళ్లు లక్ష్మీనారాయణ, అజిత్ కుమార్‌తోపాటు భార్య ఐశ్వర్య, కుమార్తె ఐరా ఉన్నారు. విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్‌లో ఆరు నుంచి పదోతరగతి వరకు రామ్‌గోపాలనాయుడు చదివారు. 2012లో స్టాఫ్ సెలక్షన్ బోర్డు పరీక్ష రాసి పూణేలో నేషనల్ డిఫెన్స్ అకాడమీకి ఎంపికయ్యారు. అక్కడ మూడేళ్లు అభ్యసించి 2015-16లో డెహ్రాడూన్‌లో ఇండియన్ మిలట్రీ అకాడమీ క్యాడెట్‌గా చేరారు. అక్కడ శిక్షణ తీసుకున్న 900 మందిలో గోల్డ్‌మెడలిస్ట్‌గా నిలిచారు. ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. లెఫ్టినెంట్‌గా రెండేళ్లు పనిచేసి 2018లో కెప్టెన్‌గా పదోన్నతి సాధించారు. 2022లో మేజర్‌గా పదోన్నతి పొందారు. రైతు కుటుంబం నుంచి వచ్చి పిన్నవయస్సులో ఆర్మీలో మేజర్ స్థాయికి ఎదిగారు. దేశ రక్షణ వ్యవస్థలో రెండో అత్యున్నత పురస్కారమైన కీర్తిచక్ర అవార్డుకు ఎంపికైన తొలి తెలుగువాడిగా చరిత్రలో నిలిచారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

'మన ఊరు.. మాటామంతీ' కార్యక్రమంలో పాల్గొన్న రావివలస గ్రామస్థులు

అభివృద్ధే అజెండాగా..

- టెక్కలిలో 'మన ఊరు.. మాటామంతీ'
- రావివలస గ్రామస్థులతో డిప్యూటీ సీఎం ముఖాముఖి
- సమస్యలను తెలుసుకుంటూ.. పరిష్కారం చూపేలా చర్యలు
- రూ.15కోట్ల నిధులు మంజూరుకు ఆదేశాలు

టెక్కలి, మే 22(ఆంధ్రజ్యోతి): ఎండలమల్లన్న కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. రావివలస గ్రామాన్ని అభివృద్ధి చేసేలా డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చర్యలు చేపట్టారు. ప్రజలతో మమేకమై.. వారి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'మన ఊరి కోసం మాటామంతీ' అనే స్క్రీన్ గ్రీవెన్స్ కార్యక్రమానికి సిక్కోలు నుంచే శ్రీకారం చుట్టారు. గురువారం టెక్కలి మండలం రావివలస గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించారు. టెక్కలిలోని భవానీ థియేటర్ వేదికగా రావివలస గ్రామస్థులతో మాట్లాడి.. వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి.. తక్షణమే పరిష్కరించేలా ఆదేశాలు జారీచేశారు. అలాగే ప్రజల అభ్యర్థన మేరకు రావివలసలో వివిధ అభివృద్ధి పనులకుగానూ సుమారు రూ.15కోట్లు మంజూరు చేయించారు. దీంతో రావివలస గ్రామస్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం..

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. 'గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం. రావివలసలో ఎండలమల్లికార్జున స్వామి ఆలయానికి టూరిజం, దేవదాయశాఖ ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేద్దాం. గ్రామంలో గ్రంథాలయం, రోడ్లు, కాలువలు, క్రీడామైదానాలు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేద్దాం. ఉన్నతస్థాయిలో ఉన్న స్థానికులు ఊరిని మర్చిపోకూడదు. గ్రామాభివృద్ధికి కృషి (మిగతా 6వ పేజీలో..)

వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. స్థానిక సంస్థల నిధులు ఇతర రంగాలకు మళ్లించారు. రాజ్యాంగ అధికారాన్ని తుంగలోకి తొక్కారు. స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు, అధికారాల కోసం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి అభినందనీయం. గిరిజన గూడేల నుంచి రహదారులు లేక డోలీతో ఆసుపత్రులకు వెళ్లే దుస్థితి. ఇది గుర్తించి అవసరమైన తారురోడ్లు వేశారు. ఇప్పటికే పల్లెపండుగ ద్వారా గ్రామాల అభివృద్ధి ప్రారంభించాం. రావివలసను ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. రూ.1,200కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తాం. ప్రకృతి వ్యవసాయాన్ని రెట్టింపు చేస్తామ'ని తెలిపారు.



కేశవరావు మృతదేహం

కేశవరావు మృతదేహం అప్పగింతలో ప్రతిష్టంభన

- జగదల్‌పూర్ నుంచి వెనుదిరిగిన నంబాళ్ల బంధువులు
- కోటబొమ్మాళి మండలం జీయన్నపేటలో విషాదం
- హైకోర్టును ఆశ్రయించనున్న పౌరహక్కుల సంఘం నేతలు

8లో

ఉద్యోగం కోసం శిక్షణ పొందుతూ..

- విజయనగరం జిల్లాలో రైలు నుంచి జారిపడి యువకుడి మృతి
- చొర్లంగిలో విషాద ఛాయలు

8లో

14 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.72 వేల నగదు, 13 సెల్‌ఫోన్లు, 6 బైక్‌లు స్వాధీనం

ఇంజన్లు ఇచ్చారు.. ట్రక్కులు మరిచారు

- నిరుపయోగంగా ట్రాక్టర్లు

8లో



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ తదితరులు

ఉపాధి కోసం శ్రీకాకుళానికి వచ్చేలా చేస్తా

- ఇటు పర్యాటకం.. అటు ఎయిర్ పోర్టు అభివృద్ధి
- మనోధైర్యం.. క్రమశిక్షణ ఉండేది టీడీపీ కార్యకర్తలకే
- 'జిల్లా మహానాడు'లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం, మే 22(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. వంశధార ప్రాజెక్టు పూర్తి, నదుల అనుసంధానం, ఎయిర్‌పోర్టు ఏర్పాటు, పర్యాటకాభివృద్ధికి కృషి చేస్తాం. ఇండస్ట్రీ కారిడార్, డ్రోన్ సిటీ.. వంటి పరిశ్రమలను వీలైతే జిల్లాకు తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నాం. ఉపాధి కోసం ఇతర ప్రాంతాల వాసులు జిల్లాకు వచ్చేలా చేస్తామ'ని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. గురువారం శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లా మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి చేపడుతున్న చర్యలను వివరించారు. సిఫారసులకు తావులేకుండా కార్యకర్తల పనితీరును స్వయంగా మంత్రి నారా లోకేశ్ పరిశీలించి.. పార్టీ పదవులు కట్టబెడుతున్నారని తెలిపారు.

7లో



జిల్లా మహానాడులో పాల్గొన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు

విద్యుత్ కాటా సీలుకు రూ.400 అదనంగా ఇవ్వాల్సిందే!

- ఆపై అనుమతి పత్రాల మంజూరులో జాప్యం
- ఏసీబీని ఆశ్రయించిన వ్యాపారులు
- కాశీబుగ్గలో రూ.1.78 లక్షలతో పట్టుబడిన తూనికలు, కొలతల అధికారి శ్రీధర్



ఏసీబీకి పట్టుబడిన తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీధర్ (వృత్తంలో వ్యక్తి). పక్కన ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

పలాస, మే 22(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ సబ్‌డివిజన్‌లో మొత్తం 14 మండలాలు. వేలాది మంది ట్రేడర్లు. వారి వద్ద ఉన్న ధర్మకాటా(విద్యుత్ తూకం)కు కొత్తగా సీలు వేయాలంటే చలానా కన్నా రూ.400 అదనంగా ఇచ్చుకోవాల్సిందే. ఇదీ కాశీబుగ్గలో తూనికలు కొలతలశాఖ అధికారి టి.శ్రీధర్ అవినీతి భాగోతం. ఓ వ్యాపారి ముందుకు వచ్చి ఆయన అవినీతిపై ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో శ్రీకాకుళం డీఎస్పీ రమణమూర్తి తన సిబ్బందితో గురువారం సాయంత్రం దాడులు చేయగా.. రూ.1.78 లక్షల అవినీతి సొమ్ముతో ఆ అధికారిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కాశీబుగ్గ తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీధర్ వ్యాపారుల నుంచి (మిగతా 8వ పేజీలో..)

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

జిల్లా వ్యాప్తంగా గురువారం హనుమజ్జయంతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి తమలపాకులు, నిమ్మకాయల దండలతో పూజలు చేశారు. కొన్నిచోట్ల గారెలు, బూరెలను నైవేద్యంగా సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


శ్రీకాకుళం: ఆరంగివారి వీధిలో గారెలతో నైవేద్యం


ఇచ్ఛాపురం: ఇరుముడులతో హనుమాన్ భక్తుల యాత్ర


కవిటి: కొత్తూరులో పూజలు చేస్తున్న విప్ బెందాళం అశోక్


కంచిలి: అర్జునాపురం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద..


వజ్రపుకొత్తూరు: కొత్తపేట రామాలయం వద్ద..


పలాస: సీతారామాలయంలో ఆంజనేయుని ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేస్తున్న భక్తులు


హిరమండలం: మండల కేంద్రం హిరమండలంలో..


సరుబుజ్జిలి: దంతపురి క్షేత్రంలో...


ఎచ్చెర్ల: అరిణాం అక్కివలసలో..


నందిగాం: గణేష్ కాలనీలో గల అభయాంజనేయస్వామి వారి ఆలయంలో..


పాతపట్నం: రామమందిరంలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

అభివృద్ధే అజెండాగా..

(ఐదో పేజీ తరువాయి)

చేయాలి. ఆడపిల్లలకు రక్షణ కవచంలా నిలవాలి. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి' అని తెలిపారు. పాఠశాల ప్రాంగణాల్లో ఆకతాయిలతో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, పార్టీ శ్రేణులకు సూచించారు. ఎండల మల్లికార్జునస్వామిని తాను త్వరలో దర్శించుకుంటానని తెలిపారు.



● **మాజీ జడ్పీటీసీ ఎల్ఎల్ నాయుడు** మాట్లాడుతూ.. 'రావివలసలో ఎండలమల్లి కార్జునస్వామి ఆలయానికి వెళ్లే మార్గాన్ని విస్తరించాలి. గ్రామంలో ఇంటర్నల్ డ్రైనేజ్ సదుపాయం కల్పించాలి. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించాలి. శ్మశానవాటికకు రోడ్డు, సీత పుష్కరిణికి మెట్లు సదుపాయం కల్పించాలి' అని కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందిస్తూ.. 'సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు చేద్దాం. డ్రైనేజ్ నిర్మాణాల్లో చాలా చోట్ల లోపాలు ఉన్నాయి. ఆ సమస్యల పరిష్కారానికి టౌన్ అండ్ కంట్రీప్లాన్ అధికారులు చర్యలు తీసు కోవాలి. కొన్నిచోట్ల డ్రైనేజ్ లోపల నుంచే పైపులైన్ వేస్తారు. అది సరికాదు. పీఎం జలజీవన్ మిషన్ ద్వారా ఆయా ప్రాంతాలకు కొంతమేర కు సదుపాయాలు కల్పిస్తాం. శ్మశానవాటికకు సీసీ రోడ్లు ఏర్పాటు చేయాల'ని కలెక్టర్‌కు ఆ దేశించారు. ఈ మేరకు ఎండలమల్లన్న ఆలయానికి వెళ్లే రహదారి విస్తరణకు రూ.3కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు చేస్తు న్నామ'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు.



● రావివలసకు చెందిన **నర్తు కృష్ణవేణి** మాట్లాడుతూ.. 'మా గ్రామంలో 83 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. సమావేశాలు పెట్టుకునేందుకు సౌకర్యం లేదు. భవనం మంజూరు చేయాల'ని కోరారు. ఈ మేరకు రూ.10 లక్షలు మంజూరు చేయనున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు.



● జనసేన నాయకుడు **అనపాన జనార్దన్‌రెడ్డి** మాట్లాడుతూ.. 'రావివలసలో ఉన్న 50 రజక కుటుంబాల జీవనోపాధి కోసం ఒక్క చెరువు దోబీఘాట్ కేటాయించాలి. శ్మశానవాటికతోపాటు 23 చెరువుల ఆక్రమణలు గుర్తించాలి. పరిసరాల్లో ఉన్న గ్రానైట్ క్వారీల నుంచి వచ్చే రూ.5కోట్ల డీఎంఎఫ్ నిధులతో మా గ్రామాలు అభివృద్ధి చేయాల'ని కోరారు. దోబీఘాట్ కోసం రూ.20 లక్షలు మం జూరు చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. శ్మశానవాటిక, చెరువుల ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు డీఎంఎఫ్ నిధులు కేటాయిస్తామని కలెక్టర్ వెల్లడించారు.



● **మాజీ సర్పంచ్ బడే జగదీష్** మాట్లాడుతూ.. 'రావివలసలో పెద్దచెరువు మరమ్మతులు చేయాలి. పంట కాలువల ఆక్రమణలు తొలగించాలి. సచివాలయాల పరిధిలో అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలి. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన జడ్పీ హైస్కూల్‌కు ప్రహరీ నిర్మించాల'ని కోరారు. దీనిపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ.. 'అధికారులు అందుబాటులో ఉండాల్సిందే. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి కూడా తీసుకెళ్తా. ప్రహరీ నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరు చేస్తున్నాను. ఆ ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా మీతో పాటు కార్యదర్శి రవికుమార్ కూడా పర్యవేక్షించాలి. పంట కాలువల ఆక్రమణలు తొలగించాల'ని కలెక్టర్‌కు ఆదేశించారు. పెద్దచెరువుకు నరేగా కింద పూడికలు తొలగించి.. అవసరమైన మరమ్మతులు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

● **దాసరి ఉషారాణి** మాట్లాడుతూ.. పిల్లల చదువు కోసం బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పించి మాలాంటి ఎన్నో కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఓ అధికారిని మీ ఇంటికి పంపిస్తానని, వ్యక్తిగతంగా మీ అభిప్రాయాన్ని తెలుసుకుంటారని డిప్యూటీ సీఎం తెలిపారు.



● **రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీష్** మాట్లాడుతూ.. 'నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా యువతకు అవకాశం కల్పించాలి. 2014-19 మధ్య పెండింగ్‌లో ఉన్న ఇళ్ల కాలనీ బిల్లులు మంజూరు చేయాలి. ఉపాధిహామీ పథకం రైతులకు అనుసంధానం చేయాలి. గొర్రెలు, మేకలకు సంబంధించి బీమా పరిహారం దక్కేలా చూడాల'ని కోరారు. ఈ రెండు అంశాలను మంత్రి అచ్చెన్న చూసుకుంటారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఉపాధి హామీ పథకం అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులను ఆదుకుంటామని తెలిపారు. కాగా.. 2014-19 మధ్యకాలంలో ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ నుంచి ఈ గ్రామానికి 46యూనిట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు మంజూరైతే లబ్ధిదారులకు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

● **గొర్లె జగదీశ్వరి** మాట్లాడుతూ.. మంచినీరు అందించే అదనపు ట్యాంకు కావాలని కోరారు. దీంతో ట్యాంకు నిర్వహణకు ఎంతకాలం పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. దీనిపై ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణరావు మాట్లాడుతూ.. 'ఇక్కడ ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలి ఉంది. అడిషనల్ ట్యాంక్ నిర్మాణానికి నాలుగైదు నెలల సమయం పడుతుంది. దీనికి రూ.62లక్షల నిధులు సమకూర్చాల'ని తెలిపారు. ఇది మీరు చేయకపోతే జర్నలిస్టుల నుంచి నేను మాటపడాల్సి వస్తుందని డిప్యూటీ సీఎం పవన్ పేర్కొన్నారు.

● **బి.రోహిణి** మాట్లాడుతూ.. చిన్న పరిశ్రమలకు ప్రోత్సహించాలని, బ్యాంకు రుణాలు అందజేయాలని కోరారు. బ్యాంకుల నుంచి రుణాలు అందజేయాలని ఎల్‌డీఎంకు డిప్యూటీ సీఎం ఆదేశించారు. అలాగే మూలపేట పోర్టు నిర్మాణానికి అవసరమైతే ఇక్కడ తయారైన సామగ్రిని వినియోగానికి పంపుతామని కలెక్టర్ తెలిపారు.

● **మాజీ ఎంపీటీసీ నర్తు కృష్ణ** మాట్లాడుతూ.. 'ఎండలమల్లికార్జున స్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా గుర్తించాలి. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాల'ని కోరారు. లైబ్రరీ మంజూరు చేస్తానని డిప్యూటీ సీఎం తెలిపారు. టూరిజం, దేవదాయశాఖతో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేస్తానన్నారు.

విజయవంతంగా..



అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో 'మన ఊరు.. మాటామంతీ' కార్యక్రమం విజయవంతమైంది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామస్థులతో మమేకమై.. పలు అభివృద్ధి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేశారు.


- ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి

కవిటిలో భారీ వర్షం



కవిటి, మే 22(ఆంధ్రజ్యోతి): కవిటిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండలు మండిపోయాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. కవిటి చుట్టు పక్కల గ్రామాలకే వర్షం పరిమితమైంది.

ఇంటర్ తరువాత..



- కోర్సుల ఎంపికే కీలకం
- మూడు, నాలుగేళ్లు కష్టపడితే ఆనందమయ జీవితం
- సంప్రదాయ డిగ్రీ కోర్సులతో ఉపాధి
- ఉన్నత చదువుకు బాటలు

నరసన్నపేట, మే 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్ తర్వాత ఏం చదవాలి? ఏ రంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మెదళ్లను తొలిచేస్తుంటాయి. డాక్టర్, ఇంజనీర్, శాస్త్రవేత్త, బ్యాంకు ఉద్యోగి, సీఏ, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు.. ఇలా ఎన్నో అవకాశాలు ఊరిస్తుంటాయి. తల్లిదండ్రులు, స్నేహితుల ఒత్తిడి మేరకు నిర్ణయం తీసుకోకుండా మీకు ఇష్టమైన కోర్సును ఎంపిక చేసుకుని ముందుకు సాగితే భవిష్యత్తు ఆనందమయంగా ఉంటుందని విద్యార్థులకు నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో 12,532 మంది ఉత్తీర్ణత సాధించారు. విశాఖపట్నం, కృష్ణా తదితర ప్రాంతాల్లో మన జిల్లాకు చెందిన మరో ఏడు వేల మంది విద్యార్థులు పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందారు. వీరిలో 70శాతం మేరకు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు సిద్ధమవుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఇంటర్ తరువాత అందుబాటులో ఉన్న కోర్సులను పరిశీలిస్తే...

ఇంజనీరింగ్

జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, ఈఏపీసెట్‌లో ఇంజనీరింగ్ కోర్సులకు ప్రాధాన్యం అధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఈసీఈ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఈఈఈ, ఏఐ, ఐటీ తదితర 112 కోర్సులు ఉన్నాయి. ఐఐటీ, ఎన్ఐటీలో చేరి ఇంజనీరింగ్ చేస్తే డిగ్రీ పూర్తయ్యేలోగా వివిధ కంపెనీల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. అలాగే మన రాష్ట్రంలో కూడా మంచి ఇంజనీరింగ్ కళాశాలల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆఫర్లు వస్తున్నాయి.

సీఏతో..

సీఏ (చార్టర్ అకౌటింగ్) కోర్సు కూడా మంచి ఉపాధినిచ్చేదే. ఇంటర్ తరువాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. దీనిలో అర్హత సాధించి, ఐపీసీసీలో చేరవచ్చు. నాలుగున్నర సంవత్సరాలు శ్రద్ధగా చదివితే సమాజంలో ఉన్నతమైన హోదా పొందే అవకాశం ఉంటుంది.

వైద్య విద్య...

ఇంటర్‌లో బైపీసీ చదివే అభ్యర్థులకు వైద్యవిద్య అభ్యసించేందుకు అవకాశం ఉంది. నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా సీటు లభిస్తుంది. ఎంబీబీఎస్ పూర్తి చేయవచ్చు. వైద్య విద్య పూర్తి చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వ వైద్యులుగా ఉద్యోగం పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అలాగే బీడీఎస్ పూర్తి చేసి దంతవైద్యులుగా స్థిరపడవచ్చు.

డిగ్రీతో బోలెడు అవకాశాలు

డిగ్రీ అంటే చిన్నచూపు వద్దు. శ్రద్ధగా చదివితే మంచి అవకాశాలు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కామన్ యూనివర్సిటీ నిర్వహించే సీయూసెట్ పరీక్షలు రాసి జాతీయ స్థాయిలో ప్రాధాన్యం గల విశ్వవిద్యాలయాల్లో హ్యూమన్ సైన్సు కోర్సులు చదవచ్చును. అలాగే మన రాష్ట్రంలో బీఏతో పాటు బీకాం జనరల్, కంప్యూటర్ కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. బీఎస్సీలో అనేక కాంబినేషన్ కోర్సులు ఉన్నాయి. బీఎస్సీ కంప్యూటర్ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది. డిగ్రీ చదివే విద్యార్థులకు మన రాష్ట్రంలో నైపుణ్యాల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇప్పుడిప్పుడే క్యాంపస్ ఇంటర్వ్యూలలో డిగ్రీ చదివే విద్యార్థులు కూడా ఎక్కువ అవకాశాలు పొందుతున్నారు. ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలనుకునేవారు డీఈడీ పూర్తి చేసి అవకాశాలు పొందవచ్చును. న్యాయవాద వృత్తిలో స్థిరపడాలనుకునే విద్యార్థులు ఐదేళ్ల కోర్సులకు చెందిన ప్రవేశ పరీక్షలు రాసి ఇంటర్ తరువాత న్యాయ విద్యను అభ్యసించవచ్చును.

ఫార్మసీకి ఎంతో ప్రాధాన్యం

ఔషధ రంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. ఈఏపీసెట్‌తోనే బీ ఫార్మసీ ప్రవేశాలు జరుగుతాయి. ఇది పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, హాస్పిటల్ ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు లభిస్తాయి.



వ్యవసాయం, ఉద్యానవనం

ఈఏపీసెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ చదివే అవకాశం ఉంది. నాలుగు సంవత్సరాల ఈ కోర్సులు పూర్తి చేస్తే ప్రభుత్వ ఉద్యోగాలు మెండుగా ఉన్నాయి. అలాగే ప్రైవేటు రంగాల్లో ఉపాధి మార్గాలు ఎక్కువగా ఉన్నాయి.

నర్సింగ్‌తో స్వయం ఉపాధి

ఇంటర్‌లో బైపీసీ విద్యార్థులకు నర్సింగ్ మరో చక్కని అవకాశం. ఈ కోర్సుతో స్వయం ఉపాధి పొందడమే కాకుండా రోగులకు సేవ చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్ తరువాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే మహిళలకు మంచి అవకాశాలు ఉంటాయి. రెండేళ్ల ఫిజియోథెరపీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.

విద్యార్థులకు సూచనలు

- ప్రతి విద్యార్థికీ ఏదో ఒక అభిరుచి ఉంటుంది. ఇప్పుడే దానిని గుర్తించాలి. తమకు సామర్థ్యం ఉన్న సబ్జెక్టును ఎంచుకుని అందులో చేరాలి.
- తల్లిదండ్రులు చెప్పారని, స్నేహితులు తీసుకున్నారని ఏ కోర్సులో పడితే దానిలో చేరవద్దు. మార్కెట్ డిమాండ్ కన్నా మనసుకు నచ్చిన దానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- పట్టుదల ఉంటేనే చదువులో రాణించగలరు. ఇంజనీరింగ్ విద్య పూర్తిచేసిన ప్రతి వందమందిలో 60 మందిని స్కిల్స్ లేవని కంపెనీలు తిరస్కరిస్తున్నాయి. ఆ జాబితాలో మీరు లేకుండా చూసుకోవాలి.
- తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలి తప్ప దిశానిర్దేశం కాదు. పిల్లలకు ఇష్టమైన కోర్సుల్లో చేరనీయండి. అందులో రాణించేలా ప్రోత్సాహం అందించాలి. వారిపై ఒత్తిడి తెచ్చి ఇబ్బందులు పెట్టకూడదు. భవిష్యత్‌కు బాటలు వేసే ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

గర్భిణులలో అధిక రక్తపోటుపై అప్రమత్తం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులలో అధిక రక్తపోటు సమస్యలు తీవ్ర పరిణామాలకు దారి తీస్తాయని... ఈ విషయమై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మే నెలను 'గర్భధారణలో రక్తపోటు వికృతుల నెల'గా, ఇదే నెల 22వ తేదీని 'ప్రీ-ఎక్లాంప్సియా దినోత్సవం'గా నిర్వహించిన సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణుల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. తల్లీ బిడ్డల సంరక్షణలో నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. తమ పరిధిలోని గర్భిణులను ముందుగానే గుర్తించి, రక్తహీనత, గర్భధారణ డయాబెటిస్, సిఫిలిస్, హిమోగ్లోబిన్ స్థాయి, హెచ్ఐవీ, క్షయ వంటి అన్ని పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. 20 ఏళ్ల లోపు లేదా 35 ఏళ్ల పైబడిన వారిని గుర్తించి పర్యవేక్షించాలన్నారు. డీఎంహెచ్ వో అనిత, డీఐవో రాందాస్, డిప్యూటీ డెమో వెంకటేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహిని పాల్గొన్నారు.



ప్రీ-ఎక్లాంప్సియా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జిల్లాలో క్రీడాభివృద్ధికి చర్యలు

- సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కూన రవికుమార్ తదితరులు

ఎచ్చెర్ల, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమదాలవలస శాసనసభ్యులు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. కుశాలపురం పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రావీణ్యం సాధించిన వారికి ప్రభుత్వం అన్ని రాయితీలు కల్పిస్తున్నట్టు చెప్పారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కూన రవికుమార్, కార్యదర్శిగా సూర శ్రీనివాసరావు, కోశాధికారిగా జీవీ సత్యనారాయణ, ఛైర్మన్‌గా కలిదిండి నర్సింహరాజు, కన్వీనర్‌గా బడగల హరిధర్, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎంవీ రమణ, ఉపాధ్యక్షులుగా ఎం.తిరుపతిరావు, బి.సురేష్, సంయుక్త కార్యదర్శులుగా ఎ.ఢిల్లీశ్వరరావు, ఎం.అరవింద్ కిరణ్‌తో పాటు మరో ఆరుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఉపాధి కోసం శ్రీకాకుళానికి వచ్చేలా చేస్తా

- ఇటు పర్యాటకం.. అటు ఎయిర్ పోర్టు అభివృద్ధి
- ఇప్పటికే 50 ఆర్వోబీలు మంజూరు
- పనితీరు ఆధారంగానే కార్యకర్తలకు పదవులు
- 'జిల్లా మహానాడు'లో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


జిల్లా మహానాడులో పాల్గొన్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు, నాయకులు

శ్రీకాకుళం, మే 22 (ఆంధ్రజ్యోతి): 'ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి శ్రీకాకుళానికి వలస వచ్చేలా జిల్లాను అభివృద్ధి చేస్తా'మని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం రాత్రి 'జిల్లా మహానాడు' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నానని వెల్లడించారు. రూ.800 కోట్లతో ఇప్పటికే 50 ఆర్వోబీలను జిల్లాకు తీసుకువచ్చానని తెలిపారు. వంశధార ప్రాజెక్టు పూర్తి, నదుల అనుసంధానం, ఎయిర్ పోర్టు, పర్యాటకం, పరిశ్రమల ఏర్పాటు ఇలా అన్ని విషయాలపై సమగ్రంగా నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులున్నా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెన్షన్ పెంపు, మెగా డీఎస్సీ. రాబోయే రోజుల్లో తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఆర్థిక సాయం అమలు చేస్తామని చెప్పారు. చంద్రబాబు నాయుడి అనుభవం రాష్ట్రానికి ఉపయోగకరంగా మారిందని చెప్పారు. శ్రీకాకుళం నుంచి హైదరాబాద్‌కు, తిరుపతికి రైళ్లు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఇరవై వేల ఎకరాలు ఉప్పు భూములు ఉంటే.. అందులో పదివేల ఎకరాలు శ్రీకాకుళం జిల్లాలోనే ఉన్నాయన్నారు. ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు అన్నివిధాలా యత్నిస్తున్నట్టు చెప్పారు. ఇండస్ట్రీ కారిడార్, డ్రోన్ సిటీ.. వంటి పరిశ్రమలను వీలైతే శ్రీకాకుళం జిల్లాకు తీసుకువచ్చేలా చేస్తున్నానని చెప్పారు. 2029లో మళ్లీ తెలుగుదేశం పార్టీదే అధికారం లక్ష్యంగా ఇప్పటి నుంచే సంక్షేమ.. అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు.

ఒడిశాతో చర్చలు

వంశధార ప్రాజెక్టును పూర్తి చేయడంతో పాటు 19 టీఎంసీల నీరు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామమని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. నేరడి బ్యారేజీ విషయమై ఒడిశా ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు ప్రారంభిస్తుందని చెప్పారు. మూలపేట పోర్టు సమీపంలో ఎయిర్‌పోర్టు .. కనెక్టివిటీ రోడ్డుతో పరిశ్రమలు తరలివస్తాయని అన్నారు. పోర్టును 25 బెర్తులతో పూర్తి చేసేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. కార్యకర్తల పనితీరును స్వయంగా మంత్రి నారా లోకేష్ పరిశీలించి.. పార్టీ పదవులు కట్టబెడుతున్నారని అన్నారు. తాము సిఫారసు చేసినా.. వాస్తవ పనితీరు ఆధారంగానే పదవులు ఇస్తారని స్పష్టం చేశారు. కడపలో నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా పరిశీలకులు పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని గత ఐదేళ్లలో రూ.పది లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వైసీపీ సర్కారు వెళ్లిపోయిందని విమర్శించారు. మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు గౌతు శివాజీ మాట్లాడుతూ జిల్లా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతి నెల ఒక సమావేశం నిర్వహించేలా మంత్రి నారా లోకేష్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో పార్టీ కార్యక్రమాలు జరగకపోవడం వల్ల ప్రతిపక్షంలో ఇటీవల ధైర్యం వచ్చేసిందని వ్యాఖ్యానించారు. కార్యకర్తల బాధలు, సమస్యలు చెప్పుకునేలా అవకాశం ఇవ్వాలని కోరారు. ఏపీ అసెంబ్లీ పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేస్తే సరిపోతుందని అన్నారు. షుగర్ ఫ్యాక్టరీకి చెందిన భూములను ఆదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైసీపీ అధికారంలోకి రాగానే తొలి కేసు తనపైనే నమోదు చేశారని అన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రోడ్లు పూర్తి చేశామని.. రూ. 16 కోట్లు పెండింగ్ నిధులు మంజూరు చేయించామని చెప్పారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ తాను పార్టీలో ఉన్నప్పటికీ సరైన పదవి లభించేందుకు 30 ఏళ్లు పట్టిందని... అలానే అందరూ సంయమనం పాటించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కలమట వెంకటరమణ, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టీడీపీ నాయకులు చౌదరి బాబ్జి, ధనలక్ష్మి, మెట్ట సుజాత, పీఎంజే బాబు, మాదారపు వెంకటేష్, విభూది సూరిబాబు, చౌదరి అవినాష్, అన్ని విభాగాల నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కేక్‌ను కేంద్రమంత్రి కట్‌చేసి.. నాయకులకు తినిపించారు.

కొనసాగుతున్న ఏపీఈఏపీ సెట్

ఎచ్చెర్ల, మే 22(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీఈఏపీ సెట్ కొనసాగుతోంది. గురువారం రెండు షిఫ్టులలో కలిపి శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 535 మంది, శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 326 మంది హాజరయ్యారు. ఈ నెల 19న ప్రారంభమైన ఈ పరీక్షలు 27వ తేదీ వరకు కొనసాగుతాయి.

పీఏసీఎస్ స్థలానికి సరిహద్దు రాళ్లు

పొందూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పోలీసుల భద్రత, రెవెన్యూ, సర్వే అధికారుల సహకారంతో పొందూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)కు జోగన్నపేట వద్ద 408 సర్వే నంబరులో ఉన్న 26.5 సెంట్ల స్థలానికి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఇటీవల మండల పరిషత్ సాధారణ సమావేశంలో పీఏసీఎస్ స్థలం ఆక్రమణకు గురవుతుందంటూ సర్పంచ్ ఆర్.లక్ష్మి... ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు రవికుమార్ ఆదేశాలతో పీఏసీఎస్ సీఈవో పాపినాయుడు తమ స్థలానికి హద్దులు నిర్ణయించాలని తహసీల్దారును కోరారు. డాక్యుమెంట్‌లో పాత సర్వేనంబరు 1-11కు కొరిలేషన్ సర్వే నంబరు 408 కావడంతో తహసీల్దార్ ఆర్.వెంకటేష్, ఎస్ఐ వి.సత్యనారాయణల ఆధ్వర్యంలో సర్వేయర్ కొలతలు వేశారు. ఈ మేరకు సర్వే రాళ్లను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో జోగన్న పేటకు చెందిన కె.గోవింద స్థలం తమదంటూ వాదన వినిపించాడు. సహేతుకమైన డాక్యుమెంట్లతో కార్యాలయానికి రావాలని తహసీల్దార్ అయనకు సూచించారు.

మినీ జెట్టీతో మత్స్యకారులకు మేలు

శ్రీకాకుళం రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం పెదగనగళ్ల పేట వద్ద మినీ జెట్టీ మంజూరయ్యింది. గురువారం జరిగిన సమావేశంలో స్థానిక మత్స్యకారులతో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. మినీ జెట్టీతో కలిగే లాభాలను వివరించారు. మత్స్యకారుల జీవన విధానంలో కీలకమైన మార్పులు జరగనున్నాయని తెలిపారు. అలల తాకిడితో బోట్లు ప్రమాదంలో పడే అవకాశాలు తగ్గుతాయన్నారు. ఈ మినీ జెట్టీ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. అనంతరం మత్స్యకారులు మాట్లాడుతూ జెట్టీ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు వై.సత్యనారాయణ, కె.గంగాధరరావు, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు బర్రి రామారావు, అమ్మోజీరావు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో మంచి ఫలితాలు

సోంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో మంచి ఫలితాలు సాధించవచ్చని మండల యాంకర్ డీఎంఎంటీ తులసయ్య అన్నారు. బేసిరామచంద్రాపురంలో నవధాన్యాల సాగుపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా సిబ్బంది ధనలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రావణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు సమయపాలన పాటించాలి


సీఎంకు, మంత్రులకు క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

కంచిలి, మే 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలని కంచిలి, సోంపేట తహసీల్దార్లు ఎన్.రమేష్‌కుమార్, బి.అప్పలస్వామి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో కంచిలి, సోంపేట రేషన్ డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలను వివరించారు. రేషన్ సరుకుల పంపిణీలో తూకం కచ్చితంగా ఉండాలని, డిపోల ఆథరైజేషన్, కీ రిజిష్టర్ అందుబాటులో ఉంచాలన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ కూర్మారావు, రేషన్ డీలర్ల సంఘ ప్రతినిధులు నాగరాజు, షణ్ముఖరావు, ప్రసాద్, రిషి, విజయ్, పీసీ పండా, మన్మథరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ రద్దుపై హర్షం

ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎండీయూ విధానాన్ని రద్దుచేసి, రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించడంపై డీలర్ల సంఘాల ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద గురువారం కంచిలి, సోంపేట రేషన్ డీలర్లు కూటమి పెద్దల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవం


ఎల్లమ్మ గజముద్దలను ఊరేగిస్తున్న భక్తులు

కవిటి, మే 22 (ఆంధ్రజ్యోతి): పుటియాదల పరిధిలో వెలసిన ఎల్లమ్మతల్లి సంబరాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ గ్రామస్థులు అమ్మవారి ప్రతిరూపమైన గజముద్దతో ఊరేగింపు చేపట్టారు. పంట పొలాల మధ్యలోనున్న ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. వర్షాలు సక్రమంగా కురిసి... పంటలు సమృద్ధిగా పండాలని ఖరీఫ్ సీజనుకు ముందు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం అనవాయితీ అని గ్రామస్థులు తెలిపారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రణస్థలం, మే 22 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.హరికృష్ణ అన్నారు. చిన్నకొవ్వాడ, పెద్దకొవ్వాడ గ్రామాల్లో గురువారం మత్స్యకారులకు అవగహన సదస్సులు నిర్వహించారు. ఉగ్రవాదులు సముద్రం మీదుగా వచ్చే సూచనలు ఉన్నాయని, కొత్తముఖాలు కనిపిస్తే మత్స్యకారులు వెంటనే 1093 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. చేపల వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

లక్ష మొక్కల పెంపకమే లక్ష్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 22(ఆంధ్రజ్యోతి): హరిత జిల్లాగా మార్చేందుకు భారీ చర్యలు చేపట్టామని.. ఇందులో భాగంగా లక్ష మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించినట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కలు పెంచేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని అటవీ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. చెరువు గట్టు, కాలువల పక్కన మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా చూడాలని చెప్పారు. ప్రతీ విభాగం తమ పేర్లతో మొక్కలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయించి, స్థానికులను వాటి సంరక్షణకు అప్పగించాలని సూచించారు.

గౌరవ వేతనం విడుదలపై సంతోషం


ఎమ్మెల్యే రవికుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, మే 22 (ఆంధ్రజ్యోతి): యువగళం పాద యాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేష్ క్రిస్టియన్ మైనారిటీలకు ఇచ్చిన హామీ మేరకు ఒకేసారి ఏడు నెలల గౌరవవేతనం రూ.35 వేలు విడుదల చేసినందుకు వారంతా సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అధ్యక్షుడు శామ్యూల్ అరుణ్‌కుమార్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే రవికుమార్ నివాసం వద్ద ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కూటమి ప్రభుత్వం చేసిన మేలును ఎన్నడూ మరువలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిర్‌కుమార్, డాక్టర్ ప్రత్తిపాటి ప్రసాద్, టెక్కలి రామారావు, జాన్ పీటర్, ప్రేమ్‌కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకవైపు సమ్మె...మరోవైపు రక్తదానం


రక్తదానం చేస్తున్న సీహెచ్‌వోలు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ హెల్త్ మిషన్‌లో సీహెచ్‌ఓలుగా పనిచేస్తూ జీతభత్యాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై వారు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం నిరసన కొనసాగిస్తూనే ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డవారికి, వృద్ధులకు, మహిళలకు రక్తం అవసరమని, అందుకే స్వచ్ఛందంగా రక్తదానం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు ఎం.ఉషారాణి, పి.ఇందుమతి, శ్రావణి, జ్యోతి, రాజీవ్ సంతోష్, రవి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జీవవైవిధ్య దినోత్సవం

ఇచ్ఛాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాఠశాలలో గురువారం అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో వివిధ రకాల పక్షులు, కుందేళ్లు, బాతులు వంటి జీవరాశులకు ఆవాసం కల్పిస్తూ... మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతంట జోహర్ ఖాన్, రమణమూర్తి, ప్రమోద్, సయ్యద్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు,

యూపీఐ కోడ్‌లతో వసూళ్లను పెంచాలి:కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ విభాగంలో డిమాండ్-కలెక్షన్-బ్యాలెన్స్ ప్రకారం నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని, యూపీఐ కోడ్‌ల ద్వారా వసూళ్లను పెంచాలని... మున్సిపల్ ఆస్తులైన షాపులు, అద్దెలపై కఠినంగా వసూలు చేయాలని అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల పని తీరుపై ఆయన గురువారం మధ్యాహ్నం జెడ్పీ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగంలో శానిటేషన్ కార్మికుల హాజరు నియమితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయిన్ల డీసిల్టింగ్ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. కమ్యూనిటీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పూర్తిగా వినియోగంలోకి తేవాలన్నారు. మున్సిపల్ వాహనాలు, వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ల ప్రగతిపై ఆరా తీశారు. టాయిలెట్ల నిర్వహణ, కొత్తగా నిర్మించే టాయిలెట్లపై కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ శాఖ పరిధిలో మంజూరైన గ్రాంట్లు, జనరల్ ఫండ్ పనుల పురోగతిపై సమీక్షించి, పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో నిర్మాణాలు, కూల్చివేతల వ్యర్థాల నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. ప్లానింగ్ సెక్రటరీలు జాబ్‌చార్టును పాటించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురంలో అమ్మవారి ఉత్సవాలు


నీలమ్మ తల్లికి ముర్రాటలు చెల్లించుకునేందుకు వెళుతున్న భక్తులు

జి.సిగడాం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామదేవత అసిరితల్లి, చంద్రమాణిక్యాలమ్మ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం నీలమ్మతల్లికి మహిళలు పసుపు, కుంకుమ, ముర్రాటలు చెల్లించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

హిమబిందుకు మెరిట్ స్కాలర్‌షిప్

శ్రీకాకుళం కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నాట్యంలో కేంద్ర ప్రభుత్వం యువ కళాకారులకు అందించే జాతీయ ఉపకార వేతనానికి శ్రీకాకుళం పట్టణానికి చెందిన హిమబిందు ఎంపికైంది. మన రాష్ట్రం నుంచి ఆమె ఒక్కరే ఎంపిక కావడం గమనార్హం.

విధుల్లో చేరిన ఈవో

అరసవల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కంటికి శస్త్ర చికిత్స చేయించుకునేందుకు 15 రోజుల సెలవుపై వెళ్లిన అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఈవో భద్రాజీ గురువారం మళ్లీ విధుల్లో చేరారు. ముందుగా ఆదిత్యుని దర్శించుకున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

అరసవల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీతో పాటు నాయకులు ఉండగా ఉంటామని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. పిడుగుపాటుతో మరణించిన శ్రీకాకుళం నగరం బుచ్చిపేటకు చెందిన గేదెల రాజారావు కుటుంబానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ రూ.50 వేలను ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం గురువారం అందజేశారు. మృతుని కుమారుడు నాగార్జున కూడా తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డి గిరిజాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తగా పద్మకు మళ్లీ అవకాశం

ఆమదాలవలస, మే 22 (ఆంధ్రజ్యోతి): నెల్లిపర్తి అంగన్‌వాడీ కార్యకర్త గా శెట్టి పద్మావతిని నియమించాలని హైకోర్టు బుధవారం ఆదేశించింది. దీనితో గురువారం సీడీపీఓ అనురాధ తిరిగి నియామక పత్రాన్ని పద్మకు అందించారు. అప్పట్లో అందిన ఫిర్యాదుల మేరకు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని 2022 నవంబర్ 17న ఆమెను తొలగించారు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఆమె తొలగింపు చెల్లదని, తిరిగి నియమించాలని హైకోర్టు సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈమేరకు గురువారం పద్మను మళ్లీ నియమిస్తూ సీడీపీఓ ఉత్తర్వులు అందించారు.

ప్రసాదం తయారీ సమయంలో దాడి

● అనంతగిరిలో ఘటన ● భూ తగాదాలే కారణమా?

వజ్రపుకొత్తూరు, మే 22(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రసాదం తయారీ సమయంలో ఓ మహిళపై బంధువులు దాడి చేసిన ఘటన అనంతగిరి గ్రామంలో గురువారం జరిగింది. పోలీ సులు, బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలోని ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రసాదం తయారీ చేస్తున్న సమయంలో జనపాన రమణమ్మపై అదే గ్రామానికి చెందిన, బాగారులైన జనపాన సాంబమూర్తి, ఇద్దరు కుమారులు దాడి చేశారు. ఈ సమ యంలో పక్కనే ఉన్న వంట పొయ్యిలోకి ఆమెను నెట్టి యడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ప్రథమ చికిత్స కోసం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరు గైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ బి.నిహార్ తెలిపారు. ఇదిలా ఉండగా ఈ రెండు కుటుంబాల మధ్య భూ తగాదాలు కొన్నేళ్లుగా ఉన్నాయని, ఇవే ఈ దాడికి కారణమై ఉంటాయన్న అనుమానాలను స్థానికులు వ్యక్తంచేస్తున్నారు.


కాలిన గాయాలతో రమణమ్మ

14 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ.72 వేల నగదు, 13 సెల్‌ఫోన్లు, 6 బైక్‌లు స్వాధీనం

వజ్రపుకొత్తూరు, మే 22(ఆంధ్రజ్యోతి): దేవునల్తాడ సమీపంలోని పొలాల్లో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్ట్ చేసి నట్టు ఎస్‌ఐ బి.నిహార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.72 వేల నగదు, ఆరు బైక్‌లు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండు రోజులుగా దేవునల్తాడ సమీపంలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఏ గ్రామంలోనైనా పేకాట నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు.

ఉద్యోగం కోసం శిక్షణ పొందుతూ..

● విజయనగరం జిల్లాలో రైలు నుంచి జారిపడి యువకుడి మృతి
● చొర్లంగిలో విషాద ఛాయలు
● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ఎల్.ఎన్.పేట, మే 22(ఆంధ్రజ్యోతి): ఆ యువకుడు ఉద్యోగం కోసం నంద్యాలలో శిక్షణ పొందుతూ వారం రోజుల కిందట స్వగ్రామం చొర్లంగి గ్రామానికి వచ్చి తిరిగి హైదరాబాద్‌లోని అక్క, బావలను చూసేందుకు వెళుతూ రైలు నుంచి జారిపడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధి చొర్లంగి గ్రామానికి చెందిన అగతముడి వెంకటేష్ (23) హైదరాబాద్ వెళ్లేందుకు ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్) రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఫలక్ నుమా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. విజయనగరం జిల్లా కొత్తవలస సమీపంలోని అంటకాపల్లి వద్ద రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. అయితే రాత్రి సమయం కావడంతో బుధవారం ఉదయం అక్కడి రైల్వే పోలీసులు గుర్తించి మృతుడి వివరాల కోసం ఆరా తీసినా లభించలేదు. చివరకి మృతుడి వద్ద లభించిన సెల్ ఫోన్ ఆధారంగా ఆయన కుటుంబ సభ్యులకు బుధవారం సాయంత్రం సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి గురువారం అప్పగించారు. అక్కడి నుంచి మృతదేహం గురువారం సాయంకాలానికి స్వగ్రామం చొర్లంగికి తీసుకురాగా యువకులు రావి చెంద్రి గ్రామం వద్ద నుంచి స్వగ్రామానికి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. అందరితో కలివిడిగా ఉంటూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందిన వెంకటేష్ వారం రోజుల కిందటే స్వగ్రామానికి వచ్చి అక్క, బావలను చూసేందుకు వెళుతూ మృతి చెందడంతో గ్రామం లో విషాదఛాయలు నెలకొన్నాయి.


వెంకటేష్ (ఫైల్)

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఆమదాలవలస, మే 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని బి.మల్లేష్ (79) మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి.. తండ్యాంవలసకి చెందిన మల్లేష్ బమ్మిడివానిపేట రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. గాయాలపాలైన వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రెండు పశువుల వ్యాన్‌లు పట్టివేత

ఎచ్చెర్ల, మే 22(ఆంధ్రజ్యోతి): నవభారత్ జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై గురువారం రెండు పశువుల వ్యాన్‌లను పోలీసులు పట్టుకున్నారు. నారాయణవలస నుంచి అలమండకు 13 దూడలను తీసుకువెళ్తున్న వ్యాన్‌ను, 8 గేదెలతో కూడిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ పశువులను కొత్తవలస గోశాలకు తరలించారు. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడిది గూనపాడు

ఎచ్చెర్ల, మే 22(ఆంధ్రజ్యోతి): కుశాలపురం సింహద్వారం వద్ద రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఆ తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 17న మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడి ఆచూకీ లభ్యమైంది. మృతుడు సరుబుజ్జిలి మండలం గూనపాడు గ్రామానికి చెందిన బిర్లంగి తవిటినాయుడు (70)గా గుర్తించారు. పత్రికలు, సామాజిక మాధ్య మాల్లో వచ్చిన ప్రకటనను చూసి ఆయన కుటుంబ సభ్యులు గుర్తించి ఎచ్చెర్ల పోలీస్ లకు సమాచారం అందించారు. తవిటినాయుడు పండుగ, పబ్బాలకు మాత్రమే ఇంటికి వస్తుంటారని, మిగిలిన సమయాల్లో బయటే తిరుగుతుంటారని కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఎస్‌ఐ ఎన్.కృష్ణ తెలిపారు. మృతుడికి భార్య తవిటమ్మ, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలోని మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచామని, శుక్రవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు.

క్షణాల్లో దుస్తులు మార్చి..

● బంగారం చోరీపై నిందితుడి వీడియో విడుదల

పలాస, మే 22(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే కాశీబుగ్గ కేటీరోడ్డులోని తాళాసు నానారావు బంగారం దుకాణంలో బుధవారం జరిగిన దొంగతనంపై సీసీ ఫుటేజీ వీడియోలను కాశీబుగ్గ పోలీసు శుక్రవారం విడుదల చేశారు. సంబంధిత వ్యక్తి ఆనవాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. నిత్యం రద్దీగా ఉండే ఈ షాపులో దొంగతనం జరగడం తీవ్ర సంచలనం కలిగించిన విషయం పాఠకులకు విదితమే. 33 గ్రాముల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి మాస్కు, టోపీ ధరించి క్షణాల్లోనే తస్కరించి పరారయ్యాడు. రోడ్డుపై పరుగెడుతూనే దుస్తులు మార్చుకుని మాయమైనట్లు సీసీ ఫుటేజీ ద్వారా పోలీసుల విచారణలో గుర్తించారు.


చోరీకి పాల్పడిన వ్యక్తి (సీసీ ఫుటేజీ)

కేశవరావు మృతదేహం అప్పగింతలో ప్రతిష్ఠంభన

● జగదల్‌పూర్ నుంచి వెనుదిరిగిన నంబాళ్ల బంధువులు
● జీయన్నపేటలో విషాదం
● హైకోర్టును ఆశ్రయించనున్న పౌరహక్కుల సంఘం నేతలు


చదువుకున్నప్పటి స్నేహితులతో నంబాళ్ల కేశవరావు (సర్కిల్‌లో)

టెక్కలి, మే 22(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్‌లోని నారాయణపూర్ జిల్లా సరిహద్దుల్లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు అగ్రనేత నంబాళ్ల కేశవరావు అలియాస్ బసవరాజు మృతదేహం అప్పగింతపై ప్రతిష్ఠంభన నెలకొంది. మృతదేహం కోసం జగదల్‌పూర్ కేశవరావు సోదరుడు నంబాళ్ల రాంప్రసాద్, ఎంపీటీసీ నంబాళ్ల రాజశేఖర్, నంబాళ్ల సుబ్బారావు, రమేష్, మార్పు వెంకటరమణ తదితరులు కాశీబుగ్గ, శ్రీకాకుళం పోలీ సులు ఇచ్చిన సమాచారం మేరకు బుధవారం రాత్రి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం జగదల్‌పూర్‌లో ఓ లాడ్జికి చేరుకున్నారు. అప్పటికే నారాయణపూర్ ఎస్‌ఐ, పోలీస్ నెంబర్లు వారికి ఇవ్వగా నారాయణపూర్ పోలీసులను సంప్రదించారు. అయితే ఇక్కడి పరిస్థితులు సద్దుమణగలేదని, మూడురోజుల తరువాత కేశవరావు మృతదేహాన్ని అప్పగిస్తామని, తిరిగి వెనక్కి వెళ్లాలని చెప్పారు. అలాగే శ్రీకాకుళం పోలీసులు సైతం వెనక్కు వచ్చేయాలని కేశవరావు బంధువులకు సూచించడంతో గురువారం వారంతా వెనుదిరిగారు. కేశవరావు మృతి చెందారనే విషయం నమ్మలేక పోతున్నామని కోటబొమ్మాళి మండలం జీయన్నపేట గ్రామస్థులు చెబుతున్నారు. మరోవైపు మావోయిస్టు చీఫ్‌గా వ్యవహరించిన కేశవరావు ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘం ప్రతినిధులు శుక్రవారం హైకోర్టులో రిట్ పిటిషన్ వేయనున్నట్లు తెలిసింది. ఇప్పటికే కేశవరావు తల్లి భారతమ్మ నుంచి రిట్ పిటిషన్‌కు సంబంధించి సంతకాలను సేకరించారు. కేశవరావు మృతదేహం బంధువులకు అప్పగించాలని, ఇటువంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకు అన్నారు. కేశవరావు మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని బొడ్డపాడు అమరవీరుల బంధుమిత్రుల కమిటీ సభ్యులు జీయన్నపేట గ్రామస్థు లను కోరుతున్నట్లు తెలుస్తోంది. ఏఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు, సీఐ విజయ్‌కుమార్ టెక్కలిలోని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి ఇంటికి చేరుకుని అక్కడే ఉన్న కేశవరావు పెద్ద సోదరుడు ఢిల్లేశ్వరరావుతో మాట్లాడారు. మృతదేహం బంధువర్గానికి అప్పగిం చడం అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని వారు పోలీసులతో అన్నట్టు సమాచారం. గురువారం రోజంతా పోలీసులు డాక్టర్ కృపారాణి నివాసం వద్ద వేచి ఉండడం గమనార్హం.

'మావోయిస్టులను హత్య చేశారు'

పలాస, మే 22(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు మరో 25 మంది మావోయిస్టులను, ఆదివాసీలను పోలీసులే హత్య చేశారని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేసు ఒక ప్రకటనలో ఆరోపించారు. శాంతి చర్చ లకు తాము సిద్ధమని, ఆదివాసీలపై హత్యాకాండ ఆపాలని, ఆపరేషన్ కగార్ వెనక్కు తీసుకోవాలని కోరినా కేంద్ర ప్రభుత్వం హత్యాకాండను కొనసాగిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో విచారణ చేపట్టాలని తమ సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. పోలీసుల ఎదురుకాల్పుల్లో అమరులైన వారికి సంతాపం తెలుపుతూ సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది.

చట్టవిరుద్ధ చర్యలు: సీపీఐఎంఎల్ లిబరేషన్

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపురం జిల్లాలో జరిగిన నరహంతక చర్యలను ఖండిస్తూ తక్షణమే మిలటరీ చర్యలను నిలిపివేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జాతీయ కార్యదర్శి దిపాంకర్ భట్టాచార్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు, ఇతర మావోయిస్టులు, ఆదివాసీ ప్రజలను బిజాపూర్ జిల్లాలో చట్ట వ్యతిరేకంగా హత్య చేశారని ఆరోపించారు. ఈ నరమేధంపై న్యాయవిచారణ చేయించాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని, మావోయిస్టులు ఏకపక్షంగా కాల్పులు విరమణ ప్రకటించారని, వారిపై సైనిక కార్యకలాపాలు నిలిపివేయాలని కోరారు.

ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను చెల్లింపునకు చర్యలు

● డీఎల్పీవో ఐవీ రమణ

జలుమూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఇకపై ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను చెల్లింపులకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని శ్రీకాకుళం డీఎల్పీవో ఐవీరమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి ఇంటి యజమాని ఆధార్ నెంబరుకు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఆ తరు వాత స్వర్ణ పంచాయతీ పోర్టర్ యాప్‌లో ఇంటి పన్ను చెల్లించుకోవచ్చన్నారు. ఇంటికి యజమాని ఆధార్‌కు అనుసంధానం చేయడంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. నేటి వరకు 50 శాతం కూడా అనుసంధానం చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీకాకుళం డీఎల్పీవో ఐవీ రమణ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

పోలాకి/జలుమూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. తన క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న చల్లబందకి చెందిన నిమ్మాడ శైలజ చికిత్స నిమిత్తం రూ.3,69,246, సొండిపేటకు చెందిన సేనాపతి ప్రభావతికి రూ.60 వేలు, జలుమూరు మండలం చల్లవానిపేటకి చెందిన దుంగ రత్నాలు మోకాళ్ల చికిత్సకు రూ.1.25 లక్షలు, తిలారు ఆర్‌ఎస్‌కి చెందిన పొట్నూరు అనంతరావు కిడ్నీ వ్యాధి చికిత్స కోసం రూ.1.57 లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో చల్లవానిపేట సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు, టీడీపీ నేతలు బైరి భాస్కరరావు, తర్ర లక్ష్మీనారాయణ, అర్జాల విష్ణు, తవిటమ్మ, దుంగ స్వామిబాబు తదితరులు పాల్గొన్నారు.


పోలాకి: సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఇంజన్లు ఇచ్చారు.. ట్రక్కులు మరిచారు

● నిరుపయోగంగా ట్రాక్టర్లు

మెళియాపుట్టి, మే 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పంచాయతీలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా అన్ని పంచాయతీలకు అధికంగా నిధులు కేటాయించారు. ఆరు నెలల కిందట మేజర్ పంచాయతీలతో పాటు జనాభా అధికంగా ఉన్న పంచాయతీలకు చెత్త సేకరణకు గాను ట్రాక్టర్లు ఇచ్చారు. ఇంజన్లు ఇచ్చినా ట్రక్కులు అందజేయక పోవడంతో పంచాయతీ కార్యాలయం ఎదుట నిరుపయోగంగా ఉన్నాయి. జిల్లాలో సుమారు 60 ట్రాక్టర్లు వివిధ పంచాయతీలకు కేటాయించినట్లు సమాచారం. ఒక్కో ట్రాక్టర్ ఇంజన్ సుమారు రూ.8 లక్షలు ఉంటుంది. అయితే కొత్త ట్రాక్టర్లు తిప్పక పోవడంతో తుప్పు పట్టే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో ప్రసాద్ పండాను వివరణ కోరగా ట్రక్కుల విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వం నుంచి ట్రక్కులు వచ్చిన వెంటనే పంచాయతీలకు ఇవ్వడం జరుగుతుందన్నారు.



మెళియాపుట్టి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్

విద్యుత్ కాటా సీలుకు రూ.400 అదనంగా ఇవ్వాల్సిందే!

(ఐదో పేజీ తరువాయి)

రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేయడమే కాకుండా వారిని ఏళ్లతరబడి అనుమతి పత్రాలు ఇచ్చేందుకు తిప్పుతున్నారు. కాశీబుగ్గ సబ్‌డివిజన్ పరిధిలో పాతపట్నం, నరసన్నపేట, ఇచ్ఛాపురం తదితర 14 మండలాలు ఉన్నాయి. వేలాది మంది వ్యాపారులు ఇక్కడి కార్యాలయంలో విద్యుత్ కాటాలకు ఏటా కొత్తగా సీళ్లు వేసి వ్యాపారాలు చేయాలి. దీనికోసం ప్రభుత్వం ఒక్కో కాటాకు రూ.300 చొప్పున రుసుం వసూలు చేస్తుంది. తూనికల కొలతలశాఖ అధికారులు సీళ్లు వేసి వ్యాపారులకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలి. కాగా.. స్థానిక తూనికల కొలతల అధికారి శ్రీధర్ మాత్రం ప్రభుత్వం నిర్దేశించిన ధరతో పాటు అదనంగా ఒక్కో కాటాకు రూ.400 డిమాండ్ చేశారు. దీంతోపాటుగా కొంత మందికి కాటాల అనుమతి పత్రాలు ఇవ్వకుండా ఏడాదిన్నరగా తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై ప్రశ్నించినా సమాధానం ఇవ్వకపోవడంతో వ్యాపారులు విసిగి.. ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. డివిజన్ పరిధిలో 445 మంది వ్యాపారుల వద్ద రూ.1.78 లక్షలు.. డిమాండ్ చేశారు. తూకాల మిషన్లు పరిశీలించే టెక్నీషియన్ ఎన్.సత్య నారాయణ ద్వారా ఈ డబ్బులు వసూలు చేశారని తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఏసీబీ అధికారులు దాడులు చేసి శ్రీధర్‌ను పట్టుకున్నారు. ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. నగదుతో పట్టుబడిన తూనికలు కొలతల శాఖ అధికారి శ్రీదర్‌ను విశాఖపట్నం ఏసీబీ కోర్టులో శుక్రవారం హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. దాడుల్లో సీఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే ఖబడ్దార్

ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ.. 'అవినీతికి ఎవరు పాల్పడినా శిక్ష తప్పదు. చిన్న వ్యాపారుల నుంచి కూడా అదనంగా ఒక్కో తూకం యంత్రానికి రూ.400 వసూలు చేయడం దారుణం. ఉద్దేశపూర్వకంగా కొన్ని కాటాలకు గత ఏడాది అక్టోబరు నుంచి అనుమతులు ఇవ్వలేదని గుర్తించాం. తూనికల కొలతలశాఖ అధికారి శ్రీధర్ గత నేర చరిత్ర కూడా పరిశీలిస్తున్నాం. అవినీతిపరులపై ప్రజలు కూడా ఫిర్యాదు చేయాలి' అని సూచించారు.

తల్లీ పిల్లలను సంరక్షించాలి

పోలాకి, మే 22(ఆంధ్రజ్యోతి): వివిధ వ్యాధుల నుంచి తల్లులు, పిల్లలను సంరక్షించడమే లక్ష్యంగా పాటుపడాలని పోలాకి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనాథ్, ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవికుమార్ అన్నారు. ప్రపంచ ప్రీ ఎంక్లాంప్సియా దినాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కవలలు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు జన్మించిన తల్లులు, అధిక రక్తపోటు ఉన్న గర్భిణులు, కుటుంబ చరిత్రలో కిడ్నీ వ్యాధి, సుగర్ ఉన్న 20 ఏళ్లలోపు, 35 ఏళ్లు దాటిన, ఒబిసిటీ ఉన్న గర్భిణులకుప్రీ ఎంక్లాంప్సియా వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. గర్భిణులు ముందుగా ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధి నివారణ సాధ్యపడుతుందన్నారు. ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది మంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, నాగమణి, ఉషా సోమేశ్వరి, ఆశాలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు

నరసన్నపేట, మే 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చెరువులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో మధుసూదనరావు హెచ్చరించారు. స్థానిక శివానగర్ కాలనీ వద్ద చెరువులో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను గురువారం పరిశీలించారు. తక్షణం పనులను నిలుపుదల చేయాలని ఆదేశించారు. అయితే పొజిషన్ పత్రాలున్నాయని నిర్మాణదారులు చెబుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై స్థానిక ప్రజలు జిల్లా ఉన్నతాధికారులకు రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి

నరసన్నపేట, మే 22(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లో ని మహిళల జీవన ప్రమాణాలు పెంపొందిం చేందుకు ప్రభు త్వం కార్యాచరణ రూపొందించిందని డీఆర్‌డీఏ పీడీ సుధాకర్ అన్నారు. గురువారం భవానీపురంలో గ్రామ సమాఖ్యసంఘ మహిళలతో సమావేశం నిర్వహించారు. మహిళలు తాము తీసుకున్న రుణాలతో యూనిట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అప్పలరామయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుచ్చల కల్పన తదితరులు పాల్గొన్నారు.

గోవింద నగర్‌లో చోరీ

● బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

శ్రీకాకుళం రూరల్, మే 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరానికి ఆనుకుని ఉన్న రూరల్ మండలంలో తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చాపురం పంచాయతీ గోవిందనగర్ కాలనీలో నివసిస్తున్న ఎంవీ సుబ్రహ్మణ్య గురునాథ్ కుటుంబంతో సహా ఈనెల 17న కర్ణాటక వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఆగంతకులు గమనించి చోరీకి పాల్పడ్డారు. అయితే గురువారం ఇంటికి తిరిగి వచ్చిన గురునాథ్ కుటుంబం ఇంటి తాళాలు తెరిచి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. బీరువాలో ఉంచిన ఆరు తులాల బంగారు, పది తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రాము తన సిబ్బంది, క్లూస్ టీం చోరీకి గురైన ఇంటిని పరిశీలించి ఆధారాలను సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా గురునాథ్ ఇంటికి పక్క ఉన్న మరో ఇంటిలో కూడా ఆగంత కులు చోరీకి యత్నించి విఫలమైనట్లు సమాచారం.

ఫ్లై ఓవర్ కింద వ్యక్తి మృతి

● నరసన్నపేటకు చెందిన కప్ప రాజారావుగా గుర్తింపు

శ్రీకాకుళం రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు ఫ్లై ఓవర్ కింద ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం వెలుగు చూసింది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అతని జేబులో ఉన్న మొబైల్ ఫోన్ ఆధారంగా నరసన్నపేటకు చెందిన కప్ప రాజారావు (60)గా గుర్తించి అతని కుమారుడు అచ్యుతరావుకు సమాచారం ఇచ్చారు. తండ్రి మృతదేహాన్ని నిర్ధారించారు. మృతుడు 15 రోజులుగా అప్పన్నమ్మ తల్లి గుడి వద్ద యాచన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించామని, మృతికి కారణాలను తెలుసుకుంటున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ పోలీసులు తెలిపారు.


రాజారావు మృతదేహం

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పోలాకి, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగరతీరం గుప్పెడుపేట 11కేవీ ఫీడర్‌లో మెయింటినెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, పోలాకి ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. దీనివల్ల గుప్పెడుపేట, గుల్లవానిపేట, జోగంపేట, మిరిబ్లిల్లిపేట, వనవిష్ణుపురం, రేగుపాడు, బార్జిపాడు, రహిమాన్‌పురం, కోడూరు, మగతపాడు, రాజపురం పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీఐగా మరడాన శ్రీనివాసరావు

నరసన్నపేట, మే 22(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మరడాన శ్రీనివాసరావును నియమిస్తూ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న జె.శ్రీనివాసరావుకు విశాఖ వీఆర్‌కు బదిలీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో వీఆర్‌లో ఉన్న మరడాన శ్రీనివాసరావును ఇక్కడికి బదిలీ చేస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

పాతపట్నం, మే 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయని జిల్లా అదనపు మలేరియా అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రానున్న వర్షాకాలంలో దోమలు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు ఇళ్లు, గ్రామ పరిశుభ్రత పాటించేలా అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూని ట్ అధికారి కె.పూర్ణిమ, గంగువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం


అవగాహన కలిగిస్తున్న దృశ్యం

నందిగాం, మే 22(ఆంధ్రజ్యోతి): నందిగాం శాఖాగ్రంథాలయంలో జూని యర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులకు పుస్తక, పేపర్ పఠనంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలు వివరించారు.

ఘనంగా హనుమజ్జయంతి

పలాస, మే 22(ఆంధ్రజ్యోతి): ఉల్లాసపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం కన్నులపండువగా నిర్వహించారు. ధర్మకర్త డోకి రామారావు దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

గర్భిణులను స్కానింగ్‌కు రిఫర్ చేయొద్దు

అరసవల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): గర్భిణులు అర్హులైన వైద్యులనే సంప్రదించాలని, ఆర్‌ఎంపీలు స్కానింగ్‌కు రిఫర్ చేయవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత తెలిపారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యం పొందడం వల్ల మాతృ మరణాలు, శిశు మరణాలను నివారించవచ్చని తెలిపారు. జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యాల నిర్ధారణకు గర్భిణులు 9 నెలల సమయంలో కనీసం రెండు సార్లు స్కానింగ్ చేయించుకోవాలన్నారు. ఆర్‌ఎంపీలు స్కానింగ్‌కు రిఫర్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేయడం, వాటి వివరాలను వెల్లడిం చడం చేస్తే వారికి 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలుశిక్ష, రూ.50 వేల నుంచి లక్ష వరకు జరిమానా విధించవచ్చునని తెలిపారు. అలాగే జిల్లాలో రిజిస్టర్ కాని ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

స్టాక్ పాయింట్ సందర్శన

బూర్జ, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ స్టాక్ పాయింట్‌ను సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు గురువారం సందర్శించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈఎంవో కె.రాంబాబు, కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు, విశ్రాంత సీఎంవో పి.ప్రభాకరరావు, ఎంఈవో ఎస్.శ్యామ సుందరరావు, మండల సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న దృశ్యం